26–5–26 rakshana main_Layout 1 8/23/2026 5:02 AM Page 1




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు సంపుటి -1 సంచిక -97 పేజీలు-4 ఆదివారం 23 ఆగస్టు 2026 వెల4/-

## చిరంజీవికి ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు



**అమరావతి, ఆగస్టు 22 (:** ప్రముఖ చలనచిత్ర నటుడు, కేంద్ర మాజీ మంత్రి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్ గా నిలిచారు .ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ప్రేక్ష కులను మరింతగాఅలరించాలనిమనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను.



02

## హార్ముజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు

## 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

02

ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం


## ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ


▸ఆయా ప్రాంతా ప్రజల నీటి కష్టాలు తొలగిపోతాయి

▸మంత్రి నిమ్మల రామానాయుడు



02





## 3 దశాబ్దాల వెలిగొండ

# కల సాకారం

▶ఆగస్టు 31న వెలిగొండ ద్వారా నీళ్ల విడుదల

▶మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం అందించిన సీఎం

▶నిర్వాసితులకు చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి

▶48 రోజుల్లో రూ.768 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం

## అనకాపల్లికి గోదావరి నీళ్లు తెప్పిస్తాం

వచ్చే నెలలోనే నీటిని రప్పించి చెరువులు నింపుతాం

అనకాపల్లి పర్యటనలో సీఎం చంద్రబాబు



వివరాలు 2వ పేజీలో

## 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి



▸టిడిపి శ్రేణులు ఐక్యంగా వైసిపిని అడ్డుకోవాలి

▸టిడిపి కేడర్ సమావేశంలో లోకేశ్

### డిఎస్సీపై చర్చకు సిద్ధం

జగన్‌కు లోకేశ్ సవాల్

02

## నాభర్తను విడిచి పెట్టండి

ంబ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి



## పవన్ ఆదేశాలతో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం ఆదేశాలతో జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు



వివరాలు 2వ పేజీలో

◆ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీ

◆బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సులో చంద్రబాబు

## నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు.

◆31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.

◆నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.

◆జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.

02



## 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

**విశాఖపట్టణం,ఆగస్ట్22(:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగా కనిపించకుండాపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది.

మిగతా 2 లో

26–5–26 rakshana main_Layout 1 8/23/2026 5:02 AM Page 2



## హర్మూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

మొదటి పేజీ తరువాయి

**వాషింగ్టన్,ఆగస్ట్22(:** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారా స్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడకపోవడమే అందుకు కారణం. హర్మూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ? ఇజ్రాయేల్ ? అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.

## 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

**వాషింగ్టన్,ఆగస్ట్22():** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి

మొదటి పేజీ తరువాయి

**విజయనగరం,ఆగస్ట్22(:** టీడీపీ నియోజకవర్గ కేడర్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి ఎలా అయ్యారో తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణుల్లో చాలామందిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన లోకేశ్.. ఎక్కడెక్కడ అక్రమ కేసులు నమోదు చేశారో వాటన్నింటినీ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని, అయితే టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది' అని వ్యాఖ్యానించారు.

మూడు పర్యాయాల పాటు టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేడర్ సమావేశం అనంతరం 2023–24 సంవత్సరంలో 'భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఉత్తమ పనితీరు కనబరిచిన 100 మంది టీడీపీ కార్యకర్తలకు నారా లోకేశ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా కేడర్‌లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## పవన్ ఆదేశాలతో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి,ఆగస్టు 22 ):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం ఆదేశాలతో జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 20 వేల హెక్టార్లలో 2 కోట్లకు పైగా సీడ్ బాల్స్‌ను అధికారులు వెదజల్లారు. ఈ మేరకు 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు పడింది. అడవుల పునరుద్ధరణ ప్రక్రియలో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో విస్తృతంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలని లక్ష్యంగా అధికారులు తీసుకున్నారు. సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కల్యాణ్ అభినందించారు.

## డిఎస్సీపై చర్చకు సిద్ధం

**అమరావతి,ఆగస్ట్22():** డీఎస్సీపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఐదోసారి సవాల్ విసిరారు. 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. చర్చకు నేను సిద్ధం' అని ఛాలెంజ్ చేశారు. శనివారంవిజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పలు కీలక అంశాలపై తెలుగుదేశం పార్టీ కేడర్‌కు దిశానిర్దేశర చేశారు. టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని లోకేశ్ వ్యాఖ్యానించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించాలని టీడీపీ కేడర్‌కు మంత్రి లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.


## నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు.

**ఉండవల్లి, ఆగస్టు 22 (:** వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్– 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింప జేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగాధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు.

# 3 దశాబ్దాల వెలిగొండ కల సాకారం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 22** మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి నీళ్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సీఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సీఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 ఏళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సీఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి



పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగా–గోదావరి– కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రత వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను."అని ముఖ్యమంత్రి అన్నారు.

**పునరావాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తిం..**గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సీఎం ప్రకాశం జిల్లాకు వచ్చినప్పుడు పరిహారం అడుగుతామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు. తమకు పరిహారం పూర్తిగా అందించిందని.. కాలనీల్లో వసతుల కల్పన బాగుందని నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలవటం సంతృప్తిగా ఉందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

# అనకాపల్లికి గోదావరి నీళ్లు తెప్పిస్తాం

మొదటి పేజీ తరువాయి

**అనకాపల్లి,ఆగస్ట్22(:** అనకాపల్లికి నీళ్లు తెచ్చే బాధ్యత తనది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తీసుకొస్తామని.. జిల్లాలో ప్రతి చెరువు, రిజర్వాయర్లను నింపుతామని వెల్లడించారు. సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని పేర్కొన్నారు. 'మేం చేస్తున్న పనులను అభినందిస్తే అదే పెద్ద కిక్' అని చెప్పుకొచ్చారు. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒక్కటే కాదని.. ఇండస్ట్రియల్ ఏరియా అని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అనకాపల్లి జిల్లా నం.1 అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంచిపనులు చేస్తుంటే కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం మండిపడ్డారు. విమర్శలు చేసేవారికి డేటా సెంటర్ అంటే తెలియదని విమర్శించారు. ఇప్పటి వరకు డేటా సెంటర్ ప్రారంభం కాలేదని, తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా సెంటర్ వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. డేటా సెంటర్లతో ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ అమరావతికి వస్తోందన్నారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే ఐతి టెక్నాలజీ నేర్పాలని సూచించారు. ఐతి నేర్చుకుంటే రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని జయించవచ్చారు.

భివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమే అని చంద్రబాబు అన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారుకావాలని సూచించారు. ఆడబిడ్డల కోసం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని అన్నారు.÷రిడ్డలి పార్టీ అరాచకాన్ని నమ్ముకుందని.. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. చాలాచోట్ల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వైసీపీ తప్పులను సరిదిద్దడానికి మూడేళ్లు పట్టిందన్నారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆ÷ూలలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ప్రజలు నిజాయితీగా ఉంటే తప్పుడు రాజకీయాలు చేసేవాళ్లు భయపడతారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## నాభర్తను విడిచి పెట్టండి

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ,ఆగస్ట్22(:** రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లీష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో 98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది. జూన్ 5న ఇది రష్యా పోర్టు నుంచి ఈజిప్టునకు బయ ల్దేరిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ నౌక ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానంలో ఉంది.

## 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

మొదటి పేజీ తరువాయి

సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి.

## సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

మొదటి పేజీ తరువాయి

**విశాఖపట్నం,ఆగస్ట్22(:** ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీగా విశాఖపట్నం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడ శాఖల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమం 2026కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు సీఎం స్వాగతం పలికారు. భారత తూర్పు తీరంలో విశాఖ దేశానికే ఆభరణమని అభివర్ణించారు. సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖను పిలుస్తారని బ్రిక్స్ దేశాల మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఉద్ఘాటించారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ – ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతున్నట్లు వ్యాఖ్యానించారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యువత ఆకాంక్షలకు ప్రతీకగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దుతున్నట్లు పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళికంగా భిన్నమైనా.. క్రీడలతో బ్రిక్స్ దేశాల ఐక్యత ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. క్రీడలు పోటీ మాత్రమే కాదని... సంస్కృతి, జీవన విధానమని తెలిపారు. యువతలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం వంటివి భారతీయ విధానమని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం ఉంటుందని వివరించారు. క్రీడలతో అ÷–లథెట్లు, కోచ్‌లు, ట్రైనర్లకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ టూరిజంతో పెట్టుబడులు, అంతర్జాతీయ ఈవెంట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ వస్తుందని స్పష్టం చేశారు. నెల్లూరు కేంద్రంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, అపెరల్, టెక్నాలజీ తయారీ కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణెళి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధమని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని వెల్లడించారు. బ్రిక్స్ దేశాల మధ్య అ÷–లథెట్లు, కోచ్‌ల పరస్పర మార్పిడికి అవకాశం ఉందని చెప్పారు. వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత, సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ బలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వకండి.. నిపుణుల హెచ్చరిక

ఇటీవలి కాలంలో ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు వంటి విద్యుత్ ఆధారిత ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. యువత నుంచి డెలివరీ సిబ్బంది వరకు వీటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా పిల్లలు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడటం, మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ–బైక్‌ల వినియోగంపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పిల్లలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర విద్యుత్ వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో అధికారులు తల్లిదండ్రుల బాధ్యతపైనా దృష్టి సారిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పిల్లలు ఈ వాహనాలు నడపడానికి అనుమతించే తల్లిదండ్రులపై చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన నిబంధనలు లేకపోవడంతో తల్లిదండ్రులు, పిల్లలు ఏ వాహనం చట్టబద్ధమైనది, ఏది ప్రమాదకరమైనది అనే విషయంలో గందరగోళానికి గురవుతున్నారు.

## కనీస వయస్సు ఉండాలా..

ఇటీవల ఓ టీనేజర్ చట్టవిరుద్ధమైన ఈ–వాహనంతో ప్రమాదానికి గురై మరణించడం ఈ అంశంపై మరోసారి చర్చకు దారితీసింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ–బైక్‌లను విక్రయిస్తున్న సంస్థలపైనా అధికారులు దృష్టి సారిస్తున్నారు. నిబంధనలకు మించి వేగం లేదా శక్తి కలిగిన ఈ–బైక్‌లను విక్రయిస్తే ఒక్కో విక్రయానికి భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ–బైక్ నడిపేవారికి కనీస వయస్సుతో పాటు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్నవారు అధిక వేగంతో ప్రయాణించే ఈ–బైక్‌లను నడపకుండా పరిమితులు విధిస్తున్నారు. వేగ పరిమితులు, హెల్మెట్ వినియోగం, వాహన సామర్థ్యానికి సంబంధించిన నిబంధనలు కూడా ప్రాంతాన్ని బట్టి మారుతున్నాయి. కొన్ని చోట్ల కొత్త నిబంధనలు తీసుకురాగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇలాంటి చర్యలపై చర్చ జరుగుతోంది.

## గణనీయంగా పెరుగుతున్న ప్రమాదాలు..

ప్రమాదాలపై నిర్వహించిన పలు అధ్యయనాలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర మోటరైజ్డ్ వాహనాల వల్ల ఆసుపత్రుల్లో చికిత్స



పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు వెల్లడించాయి. అయితే కేవలం ప్రమాదాల సంఖ్య పెరగడం కంటే గాయాల తీవ్రత, ముఖ్యంగా పిల్లల్లో తీవ్ర గాయాలు ఎక్కువగా నమోదవుతుండటం మరింత ఆందోళనకరమని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణ పెడల్ సైకిళ్లతో పోలిస్తే ఈ–బైక్‌ల ప్రమాదాల్లో గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. చిన్న వయస్సు వారు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం కూడా ప్రమాద తీవ్రతను పెంచుతున్న అంశాల్లో ఒకటిగా గుర్తించారు.

## అధిక శక్తి, వేగం ఉంటే..

చాలా ప్రాంతాల్లో తక్కువ సామర్థ్యం కలిగిన ఈ–బైక్‌లను సాధారణ సైకిళ్ల మాదిరిగానే పరిగణిస్తారు. దీంతో కొన్ని సందర్భాల్లో లైసెన్స్, ఇన్సూరెన్స్ లేదా హెల్మెట్ తప్పనిసరి కావు. అయితే అధిక శక్తి, అధిక వేగం కలిగిన వాహనాల విషయంలో అనేక ప్రాంతాలు కనీస వయస్సు, హెల్మెట్ వినియోగం వంటి అదనపు నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు సమస్య అన్ని ఈ–బైక్‌లు కాదని సైక్లింగ్ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. తక్కువ శక్తితో, పెడల్ సహాయంతో నడిచే ఈ–బైక్‌లకు బదులుగా భారీ బాడీ, బలమైన టైర్లు, పెద్ద మోటార్లు కలిగిన విద్యుత్ మోటార్‌సైకిళ్లను కొన్నిసార్లు ఈ–బైక్‌ల పేరుతో విక్రయిస్తున్నారని వారు చెబుతున్నారు. ఇటువంటి వాహనాలే ఎక్కువ ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు.

## ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలు..

ట్రాఫిక్ సిగ్నళ్లను ఉల్లంఘించడం, ఫుట్‌పాత్‌లపై ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి ప్రమాదకర చర్యలు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చట్టవిరుద్ధమేనని సైక్లింగ్ సంఘాలు చెబుతున్నాయి. కొత్త నిబంధనలు తీసుకురావడం కంటే ప్రస్తుతం ఉన్న చట్టాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. బాధ్యతాయుతంగా ఈ–బైక్‌లు ఉపయోగించే పిల్లల రాకపోకలపై అతిగా ఆంక్షలు విధించడం సరికాదని అంటున్నారు. అయితే పిల్లల భద్రత కోసం వయస్సు పరిమితులు అవసరమని కొందరు తల్లిదండ్రులు, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

## తల్లిదండ్రులు, తయారీదారులపై బాధ్యత..

సమస్యను పరిష్కరించాలంటే తల్లిదండ్రుల బాధ్యతతోపాటు వాహనాల తయారీదారులు, విక్రయదారులపై కూడా బాధ్యత ఉండాలని వారు సూచిస్తున్నారు. పిల్లలకు ఈ–బైక్ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణ పద్ధతులపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని చెబుతున్నారు. పిల్లలు ఈ–బైక్‌లను ఉపయోగించే ముందు తల్లిదండ్రులు వాహనం గురించి పూర్తిగా తెలుసుకోవాలని, పిల్లలతో కలిసి ప్రయాణించి భద్రతా నియమాలను వివరించాలని నిపుణులు సూచిస్తున్నారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనం వేగాన్ని నియంత్రించడం వంటి జాగ్రత్తలను చిన్న వయస్సు నుంచే అలవాటు చేయాలని చెబుతున్నారు. పిల్లలు సరదాగా ఈ–బైక్‌లు నడపడంతో పాటు తమకు, ఇతరులకు ఎలాంటి ప్రమాదం కలగకుండా చూసుకోవడం తల్లిదండ్రులు, పిల్లలు, తయారీదారులు, ప్రభుత్వాలు అందరి బాధ్యతగా మారింది.

# సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్.. భారీగా పెప్టైడ్స్ వినియోగం.. హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు..




పెప్టైడ్స్.. ప్రస్తుతం ఫిట్‌నెస్, వెల్‌నెస్ రంగాల్లో వేగంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. శరీరాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడం, కండరాల పెరుగుదల, బరువు తగ్గడం, చర్మం మెరుగుపడటం, నిద్ర, మానసిక చురుకుదనం, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడం వంటి అనేక ప్రయోజనాలు వీటివల్ల కలుగుతాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే ఆన్‌లైన్‌లో నియంత్రణ లేకుండా విక్రయించే కొన్ని సింథటిక్ పెప్టైడ్లపై తగినంత శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెప్టైడ్లు అంటే అమైనో ఆమ్లాలతో ఏర్పడిన చిన్న గొలుసులు. ఇవి సహజంగానే మన శరీరంలో ఉంటాయి, కణజాలాల మరమ్మత్తు వంటి వివిధ జీవక్రియలను నియంత్రించడంలో సహాయపడతాయి. ప్రయోగశాలల్లో తయారు చేసే కొన్ని పెప్టైడ్లను ఇన్సులిన్, జీఎల్‌పీ–1 ఆధారిత బరువు తగ్గించే మందులు వంటి సాధారణ ఔషధాల్లో క్రియాశీల పదార్థాలుగా ఉపయోగిస్తారు. అయితే వైద్యపరంగా అనుమతి లేని సింథటిక్ పెప్టైడ్లు మాత్రం పూర్తిగా భిన్నమైన విషయం.

## వైద్యుల పర్యవేక్షణ లేకుండానే..

ఫిట్‌నెస్ ప్రపంచంలో కొందరు వ్యక్తులు వైద్యుల పర్యవేక్షణ లేకుండానే పెప్టైడ్లను ఇంజెక్షన్ల రూపంలో ఉపయోగిస్తున్నారు. జీహెచ్‌కే–సీయూ, రెటాట్రుటైడ్, సెలాంక్, బీపీసీ–157 వంటి పేర్లు ఆన్‌లైన్ ఫోరమ్‌లు, సోషల్ మీడియా, జిమ్ వర్గాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇవి చర్మ సౌందర్యం, ఆకలి నియంత్రణ, ఆందోళన తగ్గడం, కండరాలు లేదా కణజాలాల రికవరీ వంటి ప్రయోజనాలను అందిస్తాయని వినియోగదారులు చెబుతున్నప్పటికీ, వీటి ప్రభావాలపై మనుషుల్లో తగిన స్థాయిలో పరిశోధనలు జరగలేదని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది వినియోగదారులు పెప్టైడ్లను తమ రోజువారీ ఫిట్‌నెస్ రొటీన్‌లో భాగంగా మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్ చర్చా వేదికల్లో ఎంత మోతాదులో తీసుకోవాలి, ఎంత తరచూ ఇంజెక్షన్ చేసుకోవాలి వంటి విషయాలపై కూడా పరస్పరం సలహాలు ఇచ్చుకుంటున్నారు. అయితే వైద్యపరంగా అనుమతి లేని ఉత్పత్తులకు అధికారిక వినియోగ మార్గదర్శకాలు లేకపోవడం వల్ల స్వయంగా వాటిని ఉపయోగించడం ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బలమైన శాస్త్రీయ ఆధారాలు పరిమితమే..

పెప్టైడ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, వాటిని సమర్థించే బలమైన శాస్త్రీయ ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి. కొన్ని పెప్టైడ్లను మనుషులపై సరైన స్థాయిలో పరీక్షించలేదని నిపుణులు చెబుతున్నారు. విస్తృత స్థాయి, యాదృచ్ఛిక నియంత్రిత క్లినికల్ ట్రయల్స్ ద్వారా వాటి ప్రయోజనాలు నిర్ధారణ కాలేదని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వైద్యపరమైన అనుమతి లేకుండా పెప్టైడ్లను ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. వివిధ దేశాల్లో పెప్టైడ్లు ఉపయోగించిన తర్వాత కొంతమంది ఆసుపత్రుల్లో చేరిన ఘటనలు కూడా నమోదయ్యాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో జూన్‌లో రెటాట్రుటైడ్ అని లేబుల్ చేసిన ఉత్పత్తులతో సంబంధం ఉన్న తీవ్రమైన కాలేయ గాయాల కేసులు ఆరు నమోదైనట్లు ప్రభుత్వం వెల్లడించింది. పెప్టైడ్లను ఎంతమంది ఉపయోగిస్తున్నారో కచ్చితంగా అంచనా వేయడం కష్టంగా ఉన్నప్పటికీ, ఇటీవల వాటిపై పెరుగుతున్న ఆసక్తి, వినియోగం ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని క్రీడా సామాజిక శాస్త్ర నిపుణులు పేర్కొంటున్నారు. సోషల్ మీడియా, ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, వెల్‌నెస్ పరిశ్రమలు శరీరాన్ని రసాయన పదార్థాల ద్వారా నిరంతరం ఆప్టిమైజ్ చేసుకోవచ్చనే భావనను ప్రోత్సహిస్తున్నాయని నిపుణులు విమర్శిస్తున్నారు.

## వ్యక్తిగత అనుభవాలు అనుసరణీయం కాదు..

ముఖ్యంగా ఆన్‌లైన్‌లో తమను తాము నిపుణులుగా చెప్పుకునే కొందరు వ్యక్తులు శరీరాకృతిని మెరుగుపరచుకోవడానికి పెప్టైడ్లను ఎలా ఉపయోగించాలో సలహాలు కూడా విక్రయిస్తున్నారు. అయితే స్వయంగా ప్రయోగాలు చేయడం ద్వారా వచ్చిన అనుభవాలను శాస్త్రీయ ఆధారాలుగా పరిగణించడం సరికాదని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. పెప్టైడ్ల విషయంలో పరిశోధనలకు తగినంత సమయం ఇవ్వకుండా సోషల్ మీడియాలో కనిపించే సానుకూల అనుభవాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా వైద్యపరంగా అనుమతి లేని పెప్టైడ్లను శరీరాకృతి లేదా ఫిట్‌నెస్ కోసం స్వయంగా ఇంజెక్షన్ చేసుకోవడం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రభావాలపై ఇంకా స్పష్టమైన సమాచారం అందుబాటులో లేదని వారు చెబుతున్నారు.

# డీఎన్‌ఏ మడతల్లోనూ గుండె జబ్బుల రహస్యం



మన శరీరంలోని ప్రతి కణానికి అవసరమైన జన్యు సూచనలను డీఎన్‌ఏ అందిస్తుంది. జన్యువుల్లో మార్పులే వ్యాధులకు ప్రధాన కారణమని ఇప్పటివరకు భావించినప్పటికీ, డీఎన్‌ఏ కణంలో ఎలా మడతపడి, త్రీడీ ఆకృతిలో ఎలా అమరిక అయి ఉంటుందన్న అంశం కూడా కీలకమని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా పుట్టుకతో వచ్చే గుండె లోపాలపై ఇది కొత్త అవగాహనను అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 100 మంది శిశువుల్లో సుమారు ఒకరికి పుట్టుకతో వచ్చే గుండె లోపం కనిపిస్తోంది. గుండె అభివృద్ధిలో కీలకమైన టీబీఎక్స్5 జన్యువులో మార్పులు కూడా ఇందుకు కారణమవుతాయి. ఈ జన్యువు రెండు ప్రతుల్లో ఒకటి మాత్రమే పనిచేసినప్పుడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎందుకు వస్తాయన్న ప్రశ్నకు తాజా అధ్యయనం సమాధానం సూచిస్తోంది.

## స్టెమ్ కణాలను గుండె కండర కణాలుగా మార్చి..

పరిశోధకులు మానవ స్టెమ్ కణాలను గుండె కండర కణాలుగా మార్చి, టీబీఎక్స్5 రెండు ప్రతులు ఉన్న కణాలతోపాటు ఒకటి లేదా రెండూ లేని కణాలను పరిశీలించారు. అత్యాధునిక త్రీడీ మ్యాపింగ్, కంప్యూటర్ నమూనాల ద్వారా డీఎన్‌ఏ నిర్మాణాన్ని విశ్లేషించారు. టీబీఎక్స్5 లోపంతో డీఎన్‌ఏలోని పెద్ద విభాగాలు, ప్రత్యేక ప్రాంతాలు, క్రోమాటిన్ లూప్‌లు సహా మొత్తం నిర్మాణం గణనీయంగా మారినట్లు గుర్తించారు. టీబీఎక్స్5, కోహెసిన్ మాలిక్యులర్ మోటార్‌ను డీఎన్‌ఏలోని సరైన ప్రాంతాలకు చేర్చడంలో సహాయపడుతుంది. దీంతో జన్యువులు, వాటిని నియంత్రించే ప్రాంతాలు దగ్గరై అవసరమైన జన్యు సూచనలు సరైన సమయంలో పనిచేస్తాయి. టీబీఎక్స్5 స్థాయి సగానికి తగ్గినా ఈ లూప్‌ల నిర్మాణం దెబ్బతిని గుండె అభివృద్ధికి అవసరమైన జన్యువుల పనితీరుపై ప్రభావం పడుతున్నట్లు అధ్యయనం సూచించింది.

## డీఎన్‌ఏ మడతలను సరిచేస్తే..

అదే జన్యు లోపానికి గుండెలోని వివిధ కణాలు భిన్నంగా స్పందించడం, వ్యక్తుల మధ్య గుండె లోపాల తీవ్రత ఎందుకు మారుతుందో వివరించడంలోనూ ఈ పరిశోధన ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఇతర పుట్టుకతో వచ్చే వ్యాధుల్లోనూ డీఎన్‌ఏ త్రీడీ నిర్మాణం పాత్రను పరిశీలించనున్నారు. డీఎన్‌ఏ మడతలను సరిచేయడం ద్వారా కొన్ని జన్యుపరమైన లోపాలను నివారించగలమా అన్నది తదుపరి పరిశోధనల్లో కీలక ప్రశ్నగా మారనుంది.

26–5–26 rakshana main_Layout 1 8/23/2026 5:02 AM Page 4





## చిరు సినిమాకు కాకాగా టైటిల్

అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

# నా నిజమైన హీరో మా అన్నయే

## చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ కళ్యాణ్ విషెస్



మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు.తన పాఠశాల రోజుల నుంచే అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బు÷–లలెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. సాంకేతికతపై ఆసక్తి, దాతృత్వం, కుటుంబంపై ప్రేమ, నటుడిగా సాధించిన అపారమైన విజయాలు.. కేంద్ర మంత్రిగా నిర్వహించిన బాధ్యతలు.. జాతీయ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పటికీ ఆయనలో పనిచేయాలనే తపన మాత్రం ఎప్పుడూ తగ్గలేదని పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్యపరమైన చికిత్స తర్వాత కూడా చిరంజీవి ఎంతో వేగంగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లకు వెళ్లడం ఆయనలోని అద్భుతమైన శక్తికి నిదర్శనమని పవన్ అన్నారు. 'నగరం ఎప్పుడూ నిద్రపోనట్లే, ఆయన కూడా ఎప్పుడూ విశ్రమించరు. అందుకే ఆయన మా ప్రియమైన మెగాస్టార్.. నాకు మాత్రం ఎప్పటికీ నా ఏకైక హీరో' అంటూ పవన్ తన అన్నయ్యపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

## స్పిరిట్ కోసం భారీగా పారితోషికం డిమాండ్

### నటి దీపికా పదుకొణెపై ప్రణయ్ ఆరోపణలు

ప్రభాస్ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రానున్న చిత్రం 'స్పిరిట్' నుంచి దీపికా పదుకొణె వైదొలగడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. తాజాగా సందీప్ సోదరుడు ప్రణయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆమె ప్రాజెక్ట్‌ను నుంచి వెళ్లిపోవడానికి కారణాన్ని పంచుకోవడంతో ఈ విషయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీపిక ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాన్ని ప్రణయ్ వివరించారు. తన డేట్స్ సర్దుబాటు చేయడంతో పాటు దీపిక భారీ పారితోషికం అడిగారని చెప్పారు. అలాగే సినిమా లాభాల్లో

10 శాతం వాటా అడిగారని తెలిపారు. ఈ కామెంట్స్ ఒక్క రోజుల్లోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాయి. తాజాగా దీనిపై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేసి తన స్పందనను పరోక్షంగా తెలిపారు. 'ఒక మహిళ ఇలాంటి డిమాండ్‌లు చేస్తే సహించలేకపోతున్నారు. ఆమె నో చెప్పడం వల్ల ఈగో సమస్యలు వచ్చాయి. ఇది కేవలం పురుషాధిక్య అహంకార సమస్య మాత్రమే అని ఇన్‌స్టాలో ఒకరు పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేయడం ఇప్పుడు వైరల్ అవుతోంది. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' లో మొదట దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. అయితే ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రిని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.



## వివాహబంధంతో ఒక్కటైన అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా



బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు ఉత్తర గోవాలోని మపుసా సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం. గోవాలో అమల్లో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ నిబంధనల ప్రకారం వీరి వివాహం నమోదు చేసినట్లు మపుసా సబ్–రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ వెల్లడించారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ 2018 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మాత్రం పెద్దగా బయటకు వెల్లడించలేదు. అయితే సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కలిసి కనిపిస్తూ తమ అభిమానులకు తమ బంధాన్ని పరిచయం చేస్తూ వచ్చారు.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District